# ఆలయాలపై 10% పన్ను

**కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం**

- బిల్లుకు ఆమోదం తెలిపిన శాసనసభ
- హిందూ వ్యతిరేక విధానమని బీజేపీ ధ్వజం
- హిందూ ఆలయాలపై పన్ను ఎందుకని ప్రశ్న
- ధార్మిక పరిషత్ కోసమేనన్న కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం మరో వివాదంలో చిక్కుకున్నది. దేవాలయాలపై పన్ను విధించే బిల్లును రాష్ట్ర అసెంబ్లీ బుధవారం ఆమోదించింది. దీని ప్రకారం రూ. కోటి కంటే ఎక్కువ ఆదాయం ఉన్న దేవాలయాలు తమ ఆదాయంలో పది శాతం ప్రభుత్వానికి చెల్లించాలి. అయితే ఈ బిల్లును ప్రతిపక్ష బీజేపీ తీవ్రంగా వ్యతిరేకించింది. కాంగ్రెస్ ప్రభుత్వం హిందూ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని ఆరోపించింది. ఈ బిల్లును ఆమోదించటం ద్వారా ఖజానాను నింపుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నదని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు యెడియూరప్ప విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం హిందూ దేవాలయాల నుంచి మాత్రమే ఆదాయాన్ని ఎందుకు వసూలు చేస్తున్నదని ఆయన ప్రశ్నించారు. ఇతర మతాలకు చెందిన పవిత్ర స్థలాల ఆదాయంపై ఎందుకు దృష్టి సారించటం లేదన్నది లక్షలాది హిందూ భక్తుల మదిలో మెదులుతున్న ప్రశ్న అని ఆయన పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై కర్ణాటక రవాణా శాఖ మంత్రి, కాంగ్రెస్ నేత రామలింగారెడ్డి స్పందించారు. బీజేపీ ఆరోపణలను ఆయన ఖండించారు. దేవాలయాల నుంచి వసూలు చేసే సొమ్ము ప్రభుత్వం తీసుకోదని, దానిని ధార్మిక పరిషత్ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తారని వెల్లడించారు. బీజేపీ కూడా తన హయాంలో ఇలాగే చేసిందని, రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల మధ్య ఆదాయమున్న దేవాలయాల నుంచి 5 శాతం బీజేపీ ప్రభుత్వం వసూలు చేసిందని, రూ. 25 లక్షలకు పైబడి ఆదాయమున్న ఆలయాల నుంచి పది శాతం వసూలు చేసిందని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన అర్చకుల అభ్యున్నతి, సీ గ్రేడ్ ఆలయాల అభ్యున్నతి, అర్చకుల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించటం లాంటి పనులు ధార్మిక పరిషత్ ముఖ్య ఉద్దేశాలని మంత్రి సెలవిచ్చారు.

### నయా దిగజారుడు

కర్ణాటక రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన హిందూ ధార్మిక సంస్థలు, ధార్మిక ధర్మాదాయ బిల్లుపై కేంద్ర మంత్రి, బీజేపీ నాయకుడు రాజీవ్ చంద్రశేఖర్ గురువారం ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ కొత్తగా తన దిగజారుడుతనాన్ని బయటపెట్టుకున్నదని ఆరోపించారు. రాహుల్ దిగజారుడుతనానికి ఈ బిల్లు ఒక మచ్చుతునక అని పేర్కొన్నారు. డీకే శివకుమార్, సిద్ధరామయ్యల నేతృత్వంలో కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం మతపరమైన ఎండోమెంట్ బిల్లును తీసుకొచ్చిందని ఆయన చెప్పారు. ఆలయాల నిర్వహణ కోసం హిందూ భక్తులు ఇస్తున్న విరాళాలను కాంగ్రెస్ ప్రభుత్వం తన అవసరాలకు వినియోగించుకుంటున్నదని ఆరోపించారు. హిందూ భక్తుల సొమ్మును కర్ణాటక కాంగ్రెస్ కొల్లగొడుతున్న దన్న చంద్రశేఖర్.. కాంగ్రెస్‌కు ఇది ఏటీఎం మిషన్ అని విమర్శించారు.

## నేడు దేశవ్యాప్తంగా బ్లాక్‌డే

- యువ రైతు మృతిపై అన్నదాతల ఆగ్రహం
- 26న ట్రాక్టర్ ర్యాలీలు
- అమిత్‌షా, ఖట్టర్‌లపై హత్య కేసు నమోదు చేయాలి
- బాధిత కుటుంబానికి కోటి పరిహారం ఇవ్వాలి
- ఎస్కేఎం డిమాండ్

చండీగఢ్, ఫిబ్రవరి 22: న్యాయమైన డిమాండ్ల సాధనకు తాము చేస్తున్న ఆందోళనను తూటాల ద్వారా అణచివేయాలనుకుంటున్న మోదీ ప్రభుత్వ వైఖరిపై రైతు సంఘాలు మండిపడ్డాయి. యువ రైతును అన్యాయంగా పొట్టనబెట్టుకున్నారంటూ ఆక్రోశించాయి. ఆందోళనలో పాల్గొన్న యువ రైతు మృతిపై హోం మంత్రి అమిత్ షా, హర్యానా సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్‌లపై హత్య కేసు నమోదు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) గురువారం డిమాండ్ చేసింది. ఆయన మృతికి నిరసనగా శుక్రవారం దేశ వ్యాప్తంగా బ్లాక్ డే పాటించాలని, 26న ట్రాక్టర్ ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఢిల్లీ చలో కార్యక్రమంలో భాగంగా బుధవారం పోలీసులతో జరిగిన ఘర్షణలో మృతి చెందిన శుభకరణ్ సింగ్ (21) కుటుంబానికి రూ.కోటి పరిహారాన్ని చెల్లించాలని ఎస్కేఎం నేత రాజేవాల్ డిమాండ్ చేశారు. ఆయన మృతికి నిరసనగా శుక్రవారం రైతులు కేంద్ర మంత్రి అమిత్ షా, హర్యానా హోంమంత్రి అనిల్ విజ్ దిష్టిబొమ్మలను దగ్ధం చేయాలని, ఈ నెల 26న దేశ వ్యాప్తంగా ట్రాక్టర్ ర్యాలీలు నిర్వహించాలని, మార్చి 14న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో సభకు హాజరవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఇళ్లపై, వాహనాలకు నల్ల జెండాలను ఉంచాలన్నారు. ఘటనకు బాధ్యత వహిస్తూ అమిత్ షా, ఖట్టర్ రాజీనామా చేయాలని మరో ఎస్కేఎం నేత జోగీందర్ సింగ్ ఉగ్రహ డిమాండ్ చేశారు.

### ఖాతాల స్తంభనకు విభేదిస్తూనే...

రైతులకు మద్దతుగా పోస్టులు పెట్టే వారి ఖాతాలు, పోస్టులు బ్లాక్ చేయాలంటూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై సామాజిక మాధ్యమం ఎక్స్ విభేదిస్తూనే వాటిని నిలిపివేయడానికి అంగీకరించింది. అయితే వాటిని భారత్‌లో మాత్రమే నిలిపివేస్తామని తెలిపింది. భావ ప్రకటనా స్వేచ్ఛను ఈ పోస్టులకు కూడా విస్తరించాలని కోరింది. న్యాయపరమైన ఆంక్షల కారణంగా ప్రభుత్వ ఉత్తర్వులను ప్రచురించలేకపోతున్నామని తెలిపింది.

## ఈయూలో రైతు ఉద్యమం ఉధృతం

- చేతులు కలిపిన 10 దేశాల అన్నదాతలు
- ఈయూ వ్యవసాయ విధానాలపై నిరసన

పోలీసులతో ఆందోళనకారుల ఘర్షణ

ప్రాగ్, ఫిబ్రవరి 22: యూరోపియన్ యూనియన్ (ఈయూ) ప్రవేశపెట్టిన వ్యవసాయ పాలసీలపై రైతులు గళమెత్తారు. తమకు చేటుచేసే ఈ విధానాలు వద్దనే వద్దంటూ ఈయూకు చెందిన 10 దేశాల రైతులు ఆందోళనలో భాగస్వాములయ్యారు. తమ ఆందోళనకు మద్దతు ఇస్తున్న పొరుగున ఉన్న జర్మనీ, పోలాండ్, స్లొవేకియా తదితర దేశాలకు చెందిన సహచరులను కలవడానికి చెక్ రైతులు ఆయా దేశాల సరిహద్దు మార్గాల వైపు తమ వాహనాలతో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా చెక్ వ్యవసాయ మంత్రి, స్లొవేకియా మంత్రి, పోలాండ్, హంగేరి తదితర దేశాల వ్యవసాయ శాఖల ప్రతినిధుల ఆధ్వర్యంలో చెక్-స్లొవేకియా సరిహద్దు వద్ద ర్యాలీ జరిపారు. 27 దేశాల యూరోపియన్ యూనియన్ ఇటీవల ప్రవేశపెట్టిన పర్యావరణ విధానాల పట్ల రైతులు నిరసన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రసాయనాలు, గ్రీన్ గ్యాస్ ఉద్గారాల వినియోగాన్ని పరిమితం చేసే గ్రీన్ డీల్‌పై వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆంక్షలు తమ వ్యవసాయ ఉత్పత్తుల తయారీని పరిమితం చేస్తాయని, ఈయూయేతర దేశాల కన్నా తమ ఉత్పత్తులను ఖరీదైనవిగా చేస్తాయని, తద్వారా పంటల వాణిజ్యం దెబ్బతింటుందని తెలిపారు.

### ఎస్టీ జాబితా నుంచి మైతీల తొలగింపు

- గత ఆదేశాలను సవరించిన మణిపూర్ హైకోర్టు

ఇంఫాల్, ఫిబ్రవరి 22: మణిపూర్ రాష్ట్రం రావణకాష్ఠంలా మారి వందలాది మంది అమాయకుల ప్రాణాలను బలితీసుకున్న మైతీల రిజర్వేషన్ అంశంపై హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. మైతీ వర్గీయులను ఎస్టీల జాబితాలో చేరుస్తూ గతంలో జారీ చేసిన ఉత్తర్వును మణిపూర్ హైకోర్టు రద్దు చేసింది. మైతీ కులస్థులను షెడ్యూల్డ్ ట్రైబ్ జాబితాలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ గత ఏడాది మార్చిలో జారీ చేసిన ఉత్తర్వులోని పేరాగ్రాఫ్‌ను తొలగించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఇది సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం నిర్ణయాన్ని విభేదించేలా ఉండటంతో దానిని తొలగిస్తున్నట్టు పేర్కొంది. అప్పట్లో జారీ చేసిన ఉత్తర్వుల వల్ల రాష్ట్రంలో అనిశ్చితి, అశాంతి పరిస్థితులు ఏర్పడ్డాయని, సుమారు 200 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారని కేసును విచారించిన జస్టిస్ గోల్మే గైపులిష్లు బుధవారం వ్యాఖ్యానించారు. తీర్పు ఉత్తర్వులు వెలువడిన నాలుగు వారాల్లోగా దీనిని తొలగించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.

## జాహ్నవి కేసు నిందితుడిపై అభియోగాల్లేవ్

- సాక్ష్యాధారాలు లేకపోవడమే కారణమన్న ప్రాసిక్యూషన్
- గతేడాది పెట్రోలింగ్ వాహనం ఢీకొని జాహ్నవి దుర్మరణం
- మృతిపై హేళనగా మాట్లాడిన అమెరికన్ పోలీస్ డేనియల్

వాషింగ్టన్, ఫిబ్రవరి 22: అమెరికాలో గత ఏడాది ప్రమాదవశాత్తు మృతి చెందిన తెలుగు విద్యార్థిని జాహ్నవి కందుల మృతి కేసులో సియాటెల్ పోలీస్ అధికారి కెవిన్ డేవ్‌పై క్రిమినల్ అభియోగాలు మోపడం లేదు. ప్రమాదానికి తగిన ఆధారాలు లేకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తున్నది. కింగ్ కౌంటీ ప్రాసిక్యూటింగ్ అటార్నీ బుధవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఓ అత్యవసర కాల్ రావడంతో దాన్ని పరిష్కరించడానికి కెవిన్ డేవ్ వెళ్తుండగా ఆయన వాహనం ఢీకొని జాహ్నవి మృతి చెందింది. ఈ కేసులో అన్ని వివరాలను పరిశీలించిన తర్వాత జాహ్నవి మృతికి గల కారణాల్లో కెవిన్‌పై సమంజసమైన సందేహం కలగనందున ఆయనపై క్రిమినల్ అభియోగాలుండవని ప్రాసిక్యూటింగ్ కార్యాలయం తెలిపింది. అయితే జాహ్నవి మృతిని తక్కువ చేస్తూ హేళనగా మాట్లాడిన మరో పోలీస్ అధికారి డేనియల్ అడెరెర్ వ్యాఖ్యలు ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని చెప్పింది. అతడిపై తుది చర్యలకు సంబంధించిన విచారణను మార్చి 4న చేపడతామని కోర్టు తెలిపింది.

### ఇదీ నేపథ్యం..

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుకు చెందిన జాహ్నవి(23) నార్తీస్టర్న్ విశ్వవిద్యాలయంలో మాస్టర్ డిగ్రీ చేయడానికి అమెరికా వెళ్లారు. గత ఏడాది జనవరి 23న ఆమె రోడ్డు దాటుతున్నప్పుడు 119 కిలోమీటర్ల వేగంతో దూసుకొచ్చిన పోలీస్ పెట్రోలింగ్ వాహనం ఢీకొనడంతో ఆమె 100 అడుగుల దూరం ఎగిరి పడ్డారు. అదే రోజు రాత్రి ఆమె మృతి చెందారు. ఈ కేసు దర్యాప్తుపై పోలీస్ అధికారి అడెరెర్ మాట్లాడిన వీడియో ఒకటి వైరల్ అయింది. 'ఆమె ఓ సాధారణ వ్యక్తి. ఆమె చావుకు విలువ లేదు' అన్నట్టు చులకనగా ఆయన మాట్లాడారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని భారత ప్రభుత్వం డిమాండ్ చేసింది.

### ఆమె కుటుంబానికి న్యాయం చేయాలి

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): జాహ్నవి కందుల మృతికి కారణమైన అమెరికా పోలీస్ అధికారిని సాక్ష్యాధారాలు లేవంటూ అభియోగాలు నమోదుచేయకపోవడంపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో అమెరికా రాయబార కార్యాలయం వెంటనే జోక్యం చేసుకొని, అమెరికా ప్రభుత్వ వర్గాలతో మాట్లాడి జాహ్నవి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎలాంటి పక్షపాతం లేకుండా విచారణ జరిగేలా ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఉన్నత లక్ష్యాలతో అమెరికా వెళ్లి ఈ ప్రమాదంలో చనిపోవడం అత్యంత విషాదకరం అయితే ఆమెకు జరగాల్సిన న్యాయం జరగకుండా కేసు తేలిపోవడం అంతకన్నా బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### సత్యపాల్ నివాసంపై సీబీఐ దాడులు

న్యూఢిల్లీ: కిరు హైడ్రోపవర్ ప్రాజెక్ట్ నిర్మాణంలో అవినీతి ఆరోపణలకు సంబంధించి జమ్ముకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ నివాసంలో గురువారం సీబీఐ సోదాలు నిర్వహించింది. మరికొందరి ఇండ్లు, కార్యాలయాల్లోనూ తనిఖీలు చేపట్టింది. దాదాపు 100 మంది అధికారులు జమ్ముకశ్మీర్, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, ఢిల్లీ, ముంబైలలో 30 చోట్ల సోదాలు చేశారు. బీజేపీ సర్కారు విధానాలపై మాలిక్ తరచూ విమర్శలు గుప్పిస్తున్న విషయం తెలిసిందే. కిరు హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ ప్రాజెక్టుకు సంబంధించిన రూ.2,200 కోట్ల విలువైన సివిల్ వర్క్‌ను ఓ ప్రైవేటు కంపెనీకి కేటాయించారని, ఈ కేటాయింపులో అవినీతి జరిగిందని సీబీఐ ఆరోపించింది.

### బైజూస్ సీఈవోపై లుకౌట్ నోటీసులు

న్యూఢిల్లీ: బైజూస్ వ్యవస్థాపకుడు, సీఈవో బైజు రవీంద్రన్‌పై గతంలో జారీ చేసిన లుకౌట్ సర్క్యులర్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అప్‌గ్రేడ్ చేసింది. ఆయన విదేశాలకు వెళ్లకుండా ఆపాలని ఇమ్మిగ్రేషన్ అధికారులను కోరింది. ఈ సంస్థ విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా)ను ఉల్లంఘించినట్లు ఆరోపిస్తూ, ఈడీ దర్యాప్తు చేస్తున్నది. గతంలో జారీ చేసిన సర్క్యులర్‌లో వివిధ విమానాశ్రయాలు, నౌకాశ్రయాల ద్వారా ఆయన కదలికల గురించి సమాచారం ఇవ్వాలని మాత్రమే ఇమ్మిగ్రేషన్ అధికారులను కోరింది. తాజాగా దాన్ని సవరించింది. దీని ప్రకారం ఆయన ఇకపై విదేశాలకు వెళ్లడానికి ఆస్కారం ఉండదు.

### కేజ్రీవాల్‌కు ఏడోసారి ఈడీ సమన్లు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తాజాగా మరోసారి సమన్లు జారీ చేసింది. ఈ నెల 26న తమ ముందు హాజరు కావాలని గురువారం ఆదేశించింది. చండీగఢ్ మేయర్ ఎన్నికపై సుప్రీం కోర్టులో విజయం సాధించినందుకు ప్రతీకారంగానే ఈ నోటీసులు ఇచ్చారని ఆమ్ ఆద్మీ ఆరోపించింది. కాగా, కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు జారీ చేయడం ఇది ఏడోసారి. తనకు జారీ చేసిన నోటీసులు చట్టవిరుద్ధమని పేర్కొన్న కేజ్రీవాల్ ఇంతవరకు జారీ చేసిన ఆరు నోటీసులను లెక్కచేయలేదు. ఒక్కసారి కూడా ఈడీ ముందు హాజరు కాలేదు. దీంతో తాము జారీ చేసిన సమన్లను పట్టించుకోని ఆయనపై ఈడీ ఇటీవల స్థానిక న్యాయస్థానంలో ఫిర్యాదు చేసింది. దీంతో గత వారం జరిగిన విచారణలో కేజ్రీవాల్‌కు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇచ్చిన కోర్టు తదుపరి విచారణను మార్చి 16కు వాయిదా వేసింది.

### బీబీసీ చైర్మన్‌గా సమీర్ షా

లండన్, ఫిబ్రవరి 22: భారత సంతతి బ్రిటన్ పౌరుడు, మీడియా ప్రముఖుడు డాక్టర్ సమీర్ షా 'బీబీసీ' చైర్మన్‌గాఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం బ్రిటన్ సాంస్కృతిక కార్యదర్శి లూసీ ఫ్రేజర్ ఒక ప్రకటన విడుదల చేశారు. హౌస్ ఆఫ్ కామన్స్ ఎంపీలతో కూడిన ఎంపిక కమిటీ ఆయన పేరును ఖరారుచేయగా, దీనికి బ్రిటన్ రాజు చార్లెస్-3 ఆమోదముద్ర వేయనున్నారు. టీవీ ప్రొడక్షన్, జర్నలిజంలో 40ఏండ్లకు పైగా అనుభవం కలిగిన సమీర్ షా గతంలో బీబీసీ కరెంట్ అఫైర్స్, పొలిటికల్ ప్రోగ్రామ్స్ హెడ్‌గా పనిచేశారు. బీబీసీ చైర్మన్‌గా ఆయన 2028 మార్చి వరకు కొనసాగుతారు. ఏడాదికి రూ.1.6 కోట్లు వేతనంగా సమీర్ షా అందుకోనున్నారు. మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్‌తో తెరవెనుక వ్యవహారం బయటపడటంతో రిచర్డ్ షార్ప్ బీబీసీ చైర్మన్ పదవికి గత ఏడాది రాజీనామా చేయాల్సి వచ్చింది.

### అమెరికాలో మొబైల్ సేవలకు అంతరాయం

వాషింగ్టన్: అమెరికాలో మొబైల్ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఏటీ అండ్ టీ, క్రికెట్ వైర్‌లెస్, వెరిజోన్, టీ మొబైల్‌తోపాటు పలు ఇతర మొబైల్ నెట్‌వర్క్‌లలో కనెక్టివిటీ సమస్య తలెత్తినట్లు డౌన్‌డిటెక్టర్ అనే ఔటేజ్ ట్రాకింగ్ వెబ్‌సైట్ వెల్లడించింది. ఈ మేరకు 50 వేలకు పైగా ఫిర్యాదు అందినట్టు పేర్కొన్నది. హ్యూస్టన్, అట్లాంటా, షికాగో వంటి ప్రాంతాల్లో సమస్యలు తలెత్తినట్టు వివరించింది. ఈ భారీ అంతరాయానికి గల కారణాలు ఇంకా వెల్లడికాలేదు.

## సీబీఎస్ఈలో ఓపెన్ బుక్ పరీక్షలు

**త్వరలోనే ప్రయోగాత్మకంగా నిర్వహణ • 9 -12 తరగతి విద్యార్థులకు మాత్రమే**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: పరీక్షల నిర్వహణలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) మరో కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. త్వరలోనే ఓపెన్ బుక్ పరీక్షలు (ఓబీఈ) నిర్వహించనున్నట్టు సీబీఎస్ఈ మీడియా డైరెక్టర్ రామశర్మ తెలిపారు. త్వరలో ప్రయోగాత్మకంగా ఓబీఈలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ విధానానికి సీబీఎస్ఈ గవర్నింగ్ బోర్డు 2023లోనే ఆమోదం తెలిపిందని వెల్లడించారు. సీబీఎస్ఈ పరిధిలో చదువుతున్న 9 నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఓబీఈ విధానం అమలుచేయనున్నట్టు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే నవంబర్‌లో ప్రయోగాత్మకంగా ఓబీఈలు నిర్వహించనున్నట్టు సమాచారం. ముందుగా ఎంపిక చేసిన కొన్ని పాఠశాలల్లోనే 9, 10 తరగతుల విద్యార్థులకు గణితం, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తారు. 11, 12 తరగతుల విద్యార్థులకు బయాలజీ, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులను ఓబీఈ విధానంలో నిర్వహిస్తారు. పైలట్ పరీక్షలు మంచి ఫలితాలిస్తే అన్ని పాఠశాలల్లో ఇదే విధానంలో అన్ని సబ్జెక్టుల పరీక్షలు నిర్వహిస్తారు. ఓబీఈ విధానంలో ప్రశ్నలు నేరుగా ఉండవని, విద్యార్థి విశ్లేషణా సామర్థ్యాన్ని పరీక్షించేలా ఉంటాయని బోర్డు వర్గాలు తెలిపాయి. పరీక్ష హాల్లోకి తమ పాఠ్యపుస్తకాలను తీసుకెళ్లి, వాటిలో చూసి పరీక్షలు రాయటమే ఓపెన్ బుక్ పరీక్షా విధానం. అయితే, పుస్తకంలో ఉన్నట్టుగా ప్రశ్నపత్రంలో ప్రశ్నలు అడుగరు. అడిగిన ప్రశ్నకు పాఠ్యపుస్తకంలోని అంశాలను విద్యార్థి అన్వయించి, విశ్లేషించి జవాబు రాయాల్సి ఉంటుంది.

## చలికి గడ్డకట్టి భారత విద్యార్థి మృతి

**అమెరికాలో నైట్‌క్లబ్‌లోకి అనుమతి నిరాకరించడంతో..**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: ఓ నైట్ క్లబ్ లోపలికి అనుమతించపోవటంతో ఆరు బయటే ఉండి చలికి తట్టుకోలేక అమెరికాలో ఓ భారతీయ విద్యార్థి మృతి చెందాడు. యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిస్‌లో భారతీయ సంతతికి చెందిన అకుల్ ధావన్ ఉన్నత విద్యనభ్యసిస్తున్నాడు. జనవరి 20న క్యాంపస్‌కు సమీపంలోని నైట్ క్లబ్‌కు వెళ్లాడు. అప్పటికే అతని స్నేహితులు నైట్‌క్లబ్ లోపల ఉండిపోయారు. ధావన్‌ను మాత్రం క్లబ్‌లోకి ప్రవేశించటానికి అక్కడి సిబ్బంది నిరాకరించారు. అర్ధరాత్రి 11.30 ప్రాంతంలో క్లబ్‌కు చేరుకున్న ధావన్ పలుమార్లు ప్రయత్నించినప్పటికీ రెస్టారెంట్ సిబ్బంది అతడిని లోపలకు అనుమతించలేదు. అప్పటికే తాగిన మత్తులో ఉన్న ధావన్ ఆ పక్కనే ఉన్న భవంతి మెట్లపై పడుకొని చలికి తట్టుకోలేక ప్రాణాలొదిలాడు.

### భారతీయులకు దుబాయ్ మల్టిపుల్ ఎంట్రీ వీసా

దుబాయ్: భారతీయుల కోసం దుబాయ్ ఐదేళ్ల మల్టిపుల్ ఎంట్రీ వీసాను ప్రవేశపెట్టింది. సర్వీస్ రిక్వెస్ట్‌ను స్వీకరించి, ఆమోదించిన తర్వాత రెండు నుంచి ఐదు పని దినాల్లో ఈ వీసాను జారీ చేస్తారు. ఈ వీసాను పొందిన వ్యక్తి 90 రోజులపాటు దుబాయ్‌లో ఉండొచ్చు. దీనిని మరో 90 రోజులపాటు పొడిగించుకునేందుకు అవకాశం ఉంటుంది. మొత్తం మీద ఒక సంవత్సరంలో 180 రోజులకు మించకుండా దుబాయ్‌లో ఉండేందుకు ఇది అనుమతిస్తుంది. దుబాయ్ ఆర్థిక, పర్యాటక శాఖ ఈ వివరాలను వెల్లడించింది. వ్యాపారం, వినోదాత్మక పర్యటనల కోసం ఈ వీసాను ఉపయోగించుకోవచ్చునని తెలిపింది.

### ఆ సింహాల పేర్లు మార్చండి: కలకత్తా హైకోర్టు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని సిలిగురి సఫారీ పార్కులోని ఉంచిన అక్బర్, సీత అనే సింహాల పేర్లు మార్చాలని ఆ రాష్ట్ర ప్రభుత్వానికి కలకత్తా హైకోర్టు మౌఖిక ఆదేశాలు జారీచేసింది. సింహాలకు ఆ పేర్లు పెట్టి ఎందుకు వివాదాన్ని రాజేశారని ప్రశ్నించింది. ఆడ సింహానికి సీత అని పేరు పెట్టడం వల్ల హిందువుల మనోభావాలు దెబ్బ తిన్నాయని వీహెచ్‌పీ వేసిన పిటిషన్‌పై కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఏ మతానికి చెందిన దేవతల పేర్లను జూలోని జంతువులకు పెట్టొద్దని జస్టిస్ సౌగతా భట్టాచార్య మౌఖికంగా రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. త్రిపుర జూ నుంచి తీసుకొచ్చిన ఆ సింహాలకు అక్కడే ఆ పేర్లు పెట్టారని రాష్ట్ర సర్కారు కోర్టుకు వివరణ ఇచ్చింది.

**నౌక ఢీకొని ముక్కలైన వంతెన**

*కంటైనర్ నౌక ఢీకొనడంతో నదిలోని ఒక భారీ వంతెన రెండు ముక్కలై పాక్షికంగా కూలిన ఘటన చైనాలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బ్రిడ్జిపై ఉన్న పలు వాహనాలు నీటిలో పడటంతో ఐదుగురు మృతి చెందారు. చైనాలోని గ్వాంగ్జూ నగరంలోని పెరల్ నదిపై గురువారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. భారీగా వెళుతున్న ఒక రవాణా నౌక లిజింగ్వా వంతెన స్తంభాన్ని ఢీకొని నిలిచిపోయింది. దీంతో బ్రిడ్జిలోని కొంత భాగం కూలిపోయింది. ఈ ప్రమాదంలో బ్రిడ్జిపై ఉన్న ఒక బస్సు, మోటారు సైకిల్ సహా ఐదు వాహనాలు కింద నీటిలో పడ్డాయి. ఐదుగురు మరణించారు.*

## నిరుద్యోగ భర్తకు భరణం చెల్లించాలి

- *భార్యకు ఇండోర్ కోర్టు ఆదేశాలు*

*ఇండోర్: నిరుద్యోగి అయిన భర్తకు నెలకు రూ.5,000 చొప్పున భరణం చెల్లించాలని భార్యను ఇండోర్‌లోని కుటుంబ న్యాయస్థానం ఈ నెల 20న ఆదేశించింది. వ్యాజ్య ఖర్చులను కూడా భరించాలని ఆమెకు స్పష్టంచేసింది. ఆమె ఓ బ్యూటీ పార్లర్‌కు యజమానురాలు కావడంతో ఈ తీర్పు చెప్పింది. ఆమె మానసికంగా, శారీరకంగా హింసకు గురిచేయడంతో 12వ తరగతి తర్వాత తన క్లయింట్ పై చదువులు చదువుకోలేకపోయాడని భర్త తరపు న్యాయవాది తెలిపారు. తన క్లయింట్‌ను ఆమె ఏకపక్షంగా ప్రేమించారని, ఆమె బంధువులు ఆయనను బెదిరించి, ఇద్దరికీ 2022లో ఆర్య సమాజ్‌లో పెళ్లి చేశారని చెప్పారు. కొంత కాలం తర్వాత ఆ యువజంట విడిపోయారన్నారు. తాను నిరుద్యోగినని, తనను తాను పోషించుకోలేకపోతున్నానని, తనకు భరణం ఇప్పించాలని కుటుంబ న్యాయస్థానాన్ని ఆయన ఆశ్రయించారని తెలిపారు. అదేవిధంగా, ఇండోర్ పోలీస్ కమిషనర్‌ను ఆశ్రయించి, తన భార్య, ఆమె బంధువులు తనను తీవ్రంగా హింసిస్తున్నారని ఫిర్యాదు చేశారని చెప్పారు. దీనిపై స్పందించిన ఆమె కుటుంబ న్యాయస్థానాన్ని ఆశ్రయించి, వివాహ బంధాన్ని పునరుద్ధరించాలని కోరారని తెలిపారు. అంతే కాకుండా తనను తన భర్త గృహ హింసకు గురి చేస్తున్నట్లు జిల్లా కోర్టులో కేసు దాఖలు చేశారని చెప్పారు. ఆమె సంపాదనను పరిగణనలోకి తీసుకుని ఆమె భర్తకు నెలకు రూ.5,000 చొప్పున భరణం చెల్లించాలని కుటుంబ న్యాయస్థానం ఆమెను ఆదేశించిందని తెలిపారు.*

## కుంగుతున్న అమెరికా నగరాలు

**8,97,000 నిర్మాణాలకు ముప్పు ఉన్నదని నాసా హెచ్చరిక**

*న్యూయార్క్, ఫిబ్రవరి 22: భూతాపంతో సముద్రమట్టాలు పెరగటం.. అమెరికా తూర్పు తీర ప్రాంత నగరాలకు ముప్పు తెచ్చిపెడుతున్నది. దీనికి తోడు మరో భౌగోళిక సమస్య అమెరికాను వెంటాడుతున్నది. న్యూయార్క్, వర్జీనియా, నార్ఫోక్, బాల్టిమోర్ సహా పలు నగరాలు వేగంగా కుంగిపోతున్నాయని, దీనివల్ల 8,97,000 నిర్మాణాలు దెబ్బతింటాయని 'నాసా' నిధులతో ఏర్పాటైన పరిశోధకుల బృందం హెచ్చరించింది. 'కోట్లాది మంది ప్రజలు ఆధారపడ్డ మౌలిక సదుపాయాలు, వ్యవసాయ భూములు, చిత్తడి నేలలు భూమిలోకి కుంగటం వేగంగా జరుగుతున్నది' అని వర్జీనియా టెక్‌కు చెందిన 'ఎర్త్ అబ్జర్వేషన్, ఇన్నోవేషన్ ల్యాబ్' సైంటిస్టులు కనుగొన్నారు. 'అడవులు, జాతీయ రహదారులు, విమానాశ్రయాలు మొదలైనవి ప్రభావితమవుతున్నాయి. వరదలు, తీర ప్రాంత ప్రమాదాలు పెరిగే ప్రమాదముంది' అని సైంటిస్టుల బృందం తేల్చింది. అమెరికా తూర్పు కోస్తా తీర నగరాల్లో భూమి ఏటా 1 నుంచి 2 మిల్లీమీటర్ల చొప్పున కుంగ